శరవేగంగా అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు

అంబర్‌పేట: అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఏర్పాటు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మాజీ ఎంపీ వి.హనుమంతరావు సహకారంతో ఇక్కడ భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. బుధవారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, అంబేడ్కర్‌నగర్ వేల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ నెల 14న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోటం అనిల్‌కుమార్, బాల్‌రాజ్, కుంకమ నరేందర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన కాంగ్రెస్ నేతలు

అంబర్‌పేట: ఢిల్లీలో బీసీ రిజర్వేషన్లపై నిర్వహించనున్న ధర్నాకు అంబర్‌పేట కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. బుధవారం అక్కడ జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. తరలివెళ్లిన వారిలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.లక్ష్మణ్ యాదవ్, పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలం

ముషీరాబాద్: శాంతిభద్రతలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు విమర్శించారు. హత్యలు, మానభంగాలు జరుగుతుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. బుధవారం గాంధీనగర్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... నగరంలో విదేశీ మహిళలపై అత్యాచారం జరగడం పూర్తిగా హోంశాఖ వైఫల్యం వల్లే జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో మరో మహిళపై అత్యాచారం చేయడం దారుణమని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు.

ప్రధాని మోదీకి లక్ష పోస్టుకార్డులు

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు ఏ పార్టీ మద్దతు ఇవ్వకపోతే ఆ పార్టీని తెలంగాణలో భూస్థాపితం చేస్తామని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి హెచ్చరించారు. తెలంగాణలో బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో పాస్ అయిన బిల్లును పార్లమెంట్‌లోనూ ఆమోదించాలని బుధవారం ప్రధాని నరేంద్రమోదీకి లక్ష పోస్టుకార్డులను పంపినట్లు ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న బీసీ నాయకులు, ప్రజా సంఘాలు, మేధావులు ప్రధానమంత్రికి పోస్టుకార్డుల ద్వారా లేఖలు రాయాలని ఆయన పిలుపునిచ్చారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

ముషీరాబాద్: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మొదలుకొని ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు తప్పనిసరి వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. బుధవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో ఐదేళ్లలోపు చిన్నారులకు 12 ప్రాణాత్మక వ్యాధుల నుంచి రక్షించే టీకాలను ఉచితంగా వేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పీహెచ్‌ఎన్ ఫెల్లీస్, ఏఎన్‌ఎం విజయకుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వేడుకగా ఉగాది ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

చిక్కడపల్లి: ప్రతిభ ఉంటే అన్ని రంగాలల్లో రాణించవచ్చని వక్తలు పేర్కొన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్ చిక్కడపల్లి త్యాగరాయ గానసభల సంయుక్తాధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా బుధవారం రాత్రి జి.హనుమంతారావు హాల్‌లో రాష్ట్ర స్థాయి ఉగాది ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు వీపీ చందన్‌రావు ముఖ్యఅతిథిగా పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు రామచంద్రరావు, ఎస్‌ఆర్‌ఎస్‌ఎల్‌ఎన్ మూర్తి, సాంబమూర్తి, బల్‌వీర్, శ్రీలక్ష్మి, రాజేంద్రకుమార్, నవకాంత్, సీతాలక్ష్మి, వెంకటేశ్వర్లు, రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డికి 'సాంస్కృతిక భీష్ముడు బిరుదు' ప్రదానం

చిక్కడపల్లి: సాంస్కృతిక కార్యక్రమాలు సృజనాత్మక శక్తిని పెంపొందిస్తాయని వక్తలు పేర్కొన్నారు. వంశీ ఆర్ట్‌థియేటర్స్ జంట నగరాల సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయ గానసభలో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జి.వెంకట్‌రెడ్డికి ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు పి.విజయబాబు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. 80ఏళ్ల వయస్సులోనూ సాంస్కృతిక రంగంలో వెంకట్‌రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డికి సాంస్కృతిక భీష్ముడు బిరుదును ప్రదానం చేసి సన్మానించారు.

400 ఎకరాలు హెచ్‌సీయూకే ఇవ్వాలి



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో నిరసన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఎం నాయకులు

చిక్కడపల్లి: హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు యత్నిస్తోందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తున్న సీపీఎం రాష్ట్ర నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అక్రమ అరెస్టులకు నిరసనగా బుధవారం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన ధర్నాను ఉద్దేశించి సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ భూములను విక్రయించి ఆర్థిక వ్యవస్థను నడవాలని భావించడం సరికాదన్నారు. ఈ ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని హితువు పలికారు.

◆ హెచ్‌సీయూ కోసం కేటాయించిన భూములలో 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని చేస్తున్న ప్రయత్నాలను సీపీఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆ ప్రయత్నాలను ప్రతిఘటిస్తామని ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా వెంటనే సెంట్రల్ యూనివర్సిటీకి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. తమ యూనివర్సిటీ భూములను కాపాడేందుకు విద్యార్థులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సీపీఎం పూర్తి మద్దతును తెలుపుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ప్రయోగిస్తూ, అక్రమ కేసులను బనాయించి, ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అణచివేతతో ఉద్యమాలను ఆపలేరు..

సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్ మాట్లాడుతూ... హెచ్‌సీయూ భూములను కాపాడుకునేందుకు స్థానిక విద్యార్థి సంఘం వీరోచితంగా పోరాడుతోందన్నారు. విద్యార్థుల పోరాటానికి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. 400 ఎకరాలను హెచ్‌సీయూకే ఇవ్వాలని శాంతియుత ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులను అక్రమంగా అరెస్టులు చేయటాన్ని ఖండించారు. ఇటువంటి అణచివేతతో ఉద్యమాలను ఆపలేరన్నారు. ఇప్పటికైనా తప్పును గ్రహించి, సవరించుకొని 400 ఎకరాల హెచ్‌సీయూ భూములను వెంటనే సెంట్రల్ యూనివర్సిటీకి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.అరుణజ్యోతి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.మహేందర్, కేఎన్ రాజన్న, ఆర్.వెంకటేష్, కుమారస్వామి, కిరణ్, జి.నరేష్, అశోక్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

భూముల విక్రయ నిర్ణయాన్ని విరమించుకోవాలి



ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నేతలు

ముషీరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం అమ్మేందుకు ప్రయత్నిస్తోంన్నదని వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హెచ్‌సీయూ స్థలాల పరిరక్షణ కోసం మహిళా మోర్చా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు శిల్పారెడ్డి చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని అడ్డుకుని ఆమెను అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ బీజేపీ నాయకులు ఆమెను కలిసి మద్దతు తెలిపారు. అనంతరం నవీన్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. హెచ్‌సీయూ స్థలాన్ని కాపాడేందుకు విద్యార్థులు, బీజేపీ నాయకులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అరెస్టులు చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచిముదిరాజ్, బీజేవైఎం అధ్యక్షుడు ఆయూష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసు, మహిళా కమిటీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. పది పరీక్షలు ముగిసాయి



అంబర్‌పేట ప్రభుత్వ పోలీసు బాలల పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థులు

అంబర్‌పేట: పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిసాయి. అంబర్‌పేట నియోజకవర్గంలోని 25 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు చివరి పరీక్ష రాసారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పరీక్ష ముగియగానే విద్యార్థులు సంతోషంగా బయటకు వచ్చారు. ఇక పాఠశాల దశకు సెలవంటూ విద్యార్థులు ఆనందంగా వెళ్లిపోయారు.



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు రాసిన విద్యార్థినులు

ముషీరాబాద్ మండలంలో పరీక్ష రాసిన 4807 మంది

ముషీరాబాద్: ముషీరాబాద్ మండల పరిధిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 21 నుంచి ప్రారంభమైన పరీక్షలు బుధవారం ముగిశాయి. మండల పరిధిలో 4807 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్ తెలిపారు.

'బీసీ బిల్లు' గవర్నర్ ఆమోదం పొందలేదు



కాచిగూడలో మీడియాతో మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కాచిగూడ: తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు చేయడంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నందున న్యాయ నిపుణులతో లోతుగా చర్చించి అమలుకు పగడ్బందీగా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. బుధవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్ల కోసం ఒక బిల్లు, రాజకీయ రిజర్వేషన్ల కోసం మరొక బిల్లు ఉందన్నారు. ఈ రెండు బిల్లులను కేంద్రానికి పంపి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూడడం సరికాదన్నారు. తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ రిజర్వేషన్ బిల్లు ఇంత వరకు గవర్నర్ ఆమోదం పొందలేదన్నారు. మరి ఇలాంటి పరిస్థితుల్లో పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు పెట్టాలని చెప్పడం, కేంద్రంపై చలో ఢిల్లీ కార్యక్రమాలు పెట్టడం అనేది బీసీలను మోసం చేయడమే అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీలం వెంకటేష్, వేముల రామకృష్ణ, జిల్లాపెల్లి అంజి, భాగ్యలక్ష్మీ, జెల్ల నరేందర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఏప్రిల్'ను మహనీయుల మాసంగా ప్రకటించాం

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఏప్రిల్ నెల మొత్తాన్ని మహనీయుల మాసంగా ప్రకటించి అనేక కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు చెప్పారు. బుధవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ... 'ఏప్రిల్'ఫూల్ నెల కాదని బీఆర్ అంబేడ్కర్, పూలే వంటి మహనీయులు పుట్టిన నెలగా భావించి మహనీయుల మాసంగా ప్రకటించామని తెలిపారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారత్‌లో కుల వివక్షత, అంటరానితనం ఇంకా కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేల ఆధారంగా పరిశీలిస్తే 128 రకాల కుల వివక్షత దేశంలో ఉందన్నారు. ఇంటి అద్దె ఇవ్వడంలో కూడా అగ్రవర్ణాల వారు కుల వివక్షతను పాటిస్తున్నారని పేర్కొన్నారు. రజకులు ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో దళితుల బట్టలు ఉతకటం లేదన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ చెప్పిన సిఫారసులు ఎక్కడా అమలు కావడం లేదన్నారు. రాజమండ్రి దగ్గర జరిగిన పాస్టర్ ప్రవీణ్ మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని కారుచౌకగా అమ్మడానికి ప్రభుత్వం చూస్తోందన్నారు. దీనిపై నిరసన తెలిపిన విద్యార్థులను అరెస్టు చేయడం సరికాదన్నారు. హెచ్‌సీయూ భూముల విక్రయ నిర్ణయం వెనక్కి తీసుకుని బేషరతుగా విద్యార్థులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నగర అధ్యక్షుడు ఎం.దశరథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి డి. సుబ్బారావు, గుంటి లక్ష్మణ్, ఎం. కృపాసాగర్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

5న పంచాయతీ కార్మికుల రాష్ట్ర మహా సభ

ముషీరాబాద్: తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ టీయూసీఐ అనుబంధ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం అన్నారు. ఈ నెల 5న నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం మార్క్స్‌భవన్‌లో మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిపోతున్న ధరలు చాలీచాలని జీతభత్యాలతో పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీపీ కార్మికులకు మున్సిపల్ కార్మికుల తరహాలోనే జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐలను అమలు చేయాలన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీయుసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ, ఎం.హన్మేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గజల్, నృత్య, సంగీతోత్సవాలు 5న

కాచిగూడ: చారిత్రక చౌమహల్లా ప్యాలెస్‌లో జంట నగరాల కళా ప్రియుల కోసం గజల్, నృత్య, సంగీత ఉత్సవాలు చౌమహల్లా ప్యాలెస్ సౌజన్యంతో పరిచాయ్ ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంస్థ ఫౌండర్ ట్రస్టీ జైవంత్ నాయుడు తెలిపారు. భారతీయ శాస్త్రీయ సంగీతం, గజల్, నృత్యం ద్వారా సంప్రదాయాన్ని కాపాడటం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రచారం చేయడం లక్ష్యంగా ఈ ఉత్సవాలను భారతదేశంలోని ప్రఖ్యాత కళాకారులచే నిర్వహిస్తున్నామన్నారు. ఏప్రిల్ 5న సాయంత్రం 6:30 గంటలకు ఈ సంగీత ఉత్సవాలు ప్రారంభమవుతాయని, న్యూఢిల్లీకి చెందిన పండిట్ రాజేంద్ర గంగాని (కథక్), భోపాల్‌కు చెందిన పండిట్ ఉమాకాంత్, అనంత్ గుండెచా (ధ్రుపద్), హైదరాబాద్‌కు చెందిన జ్యోతిశర్మ (గజల్) ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. సంగీతం, నృత్యం, భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని గుర్తించి చౌమహల్లా ప్యాలెస్ యాజమాన్యం హైదరాబాద్ కళాప్రియుల కోసం ఇకపై తరచుగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించిందన్నారు.

సామూహిక ఉపనయనం 20న

నల్లకుంట: అఖిల బ్రాహ్మణ సమాజ అభివృద్ధి సంస్థ(ఏబీసీడీవో) ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన 41వ సామూహిక ఉచిత ఉపనయన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కీసరగుట్టలోని అన్నపూర్ణ బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం హాల్‌లో ఉదయం 10.55గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని అన్నారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన షేక్ బడే సాహెబ్ కుమారుడు షేక్ ఫక్రుద్దీన్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇంట్లోనే వాష్ రూమ్ యాసిడ్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఫక్రుద్దీన్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రి నిర్మాణ పనులు తక్షణమే చేపట్టండి

నగర కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



అంబర్‌పేట మున్సిపల్ కాలనీలో ఆస్పత్రి నిర్మాణ పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్



వైద్యసేవలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

అంబర్‌పేట: ప్రభుత్వం మంజూరు చేసిన 30 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. అంబర్‌పేట మున్సిపల్ కాలనీలో ఉన్న పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.5 కోట్ల అంచన వ్యయంతో నిర్మించనున్న 30 పడకల ఆస్పత్రి పనుల ప్రారంభంలో జాప్యాన్ని నివారించాలని ఆయన అధికారులకు సూచించారు. బుధవారం అంబర్‌పేటలోని మున్సిపల్‌కాలనీలో ఉన్న ఆస్పత్రిని వివిధ విభాగల అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. అక్కడ పేదలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆస్పత్రి పనులను ప్రారంభించడాకి అడ్డంకిగా ఉన్న చెట్లను ఇతర ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అటవిశాఖ అధికారులకు సూచించారు. ఇక్కడి ఆవరణలో ఉన్న చెట్లను తొలగిస్తే పనులు ప్రారంభించేందుకు అడ్డంకులు తొలుగుతాయని పేర్కొన్నారు. అలాగే ఆస్పత్రిలో ప్రసవాలు, అందుతున్న ఇతర వైద్య సేవలను వైద్యులను అడిగి తెలుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, డీసీహెచ్‌ఎస్ రాజేందర్, ఆర్‌డీఓ రామకృష్ణ, డీఈఈ జగదీష్ ప్రసాద్, శివప్రసాద్, మెడికల్ ఆఫీసర్ దాక్షాయని, ఎఫ్ఆర్ఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం పోస్టర్ ఆవిష్కరణ



సీతారాముల కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

ముషీరాబాద్: ఆర్యవైశ్య సంఘం రామ్‌నగర్ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ వాసవీ స్వర్ణ నిధి రాంనగర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 25వ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఈ నెల 5,6,7 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు వి.సుధాకర్ గుప్తా తెలిపారు. రాంనగర్‌లోని సెయింట్ పాయిస్ స్కూల్ వద్ద కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు బుధవారం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. 5న ఉదయం 6 గంటలకు సుదర్శన హోమం, 10 గంటలకు మంగళ స్నానం, మధ్యాహ్నం మెహందీ, సాయంత్రం 5 గంటలకు పారాయణం ఉటుందన్నారు. 6న ఉదయం 8.30 గంటలకు ఎదుర్కోలు, అనంతరం సీతారాముల కల్యాణం, 7న సోమవారం ఉదయం 8.30 గంటలకు సత్యనారాయణ స్వామి వ్రతం, 11 గంటలకు సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేకం, 12 గంటలకు మహిళలచే దాండియా నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. 70 ఏళ్లు పైబడిన మాతృమూర్తులకు పాదాభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బుక్క రమేష్, సత్యవర్ధన్, ఎర్రం శ్రీనివాస్, చామల శ్రీనివాస్, ఎర్రం శేఖర్, నేతి సత్యనారాయణ, సంఘ సేవకులు లింగంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో సీతారాములు, ఆంజనేయస్వామి

నల్లకుంట: శ్రీరామ నవమిని పురస్కరించుకొని బుధవారం న్యూనల్లకుంటలోని శ్రీ సీతారాంజనేయ సరస్వతి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నేత్ర పర్వంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు ఉదయం 6గంటలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం సీతారాములను పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.

శంకరమఠంలో శక్తి గణపతికి అభిషేకం..

చైత్ర మాస శుద్ధ చవితిని పురస్కరించుకొని బుధవారం నల్లకుంట శంకరమఠంలో శక్తి గణపతికి అభిషేకం కావించి విశేష పూజలు కావించారు. అలాగే వేదపండితుల వేద మంత్రోచ్చరణల నడుమ హోమం నిర్వహించారు.

కన్స్యూమర్ సొసైటీ ఎన్నికల్లో సంజీవరెడ్డి ప్యానల్ విజయం



వీఎస్‌టీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ కన్స్యూమర్ సొసైటీలో ఎన్నికల్లో గెలుపొందిన డైరెక్టర్లు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వీఎస్‌టీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ కన్స్యూమర్ సొసైటీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి ప్యానల్ ఘన విజయం సాధించింది. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ కార్యాలయంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్ర 6గంటల వరకు ఎన్నికలు జరిగాయి. ఈ సొసైటీలో 186 మంది ఓటర్లు ఉండగా 173 మంది ఓటు వేసినట్లు ఎన్నికల అధికారి శివకుమార్ తెలిపారు. ఈ పోటీలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి సభ్యులు ఏకపక్షంగా 10 మంది గెలుపొందారు. నాయిని నర్సింహారెడ్డి ప్యానల్ తరపున బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి ప్యానల్ పోటీ పడింది. ఎస్-కోటా నుంచి గౌరీశంకర్, జనరల్ కోటా నుంచి అభిషేక్, అజయ్ కుమార్, నవీన్‌కుమార్, పాల్‌సింగ్, రాజాశేఖర్‌రెడ్డి, రాహుల్, సత్యనారాయణ, శ్యామ్‌కుట్టి, మహ్మద్ హబీబ్ షరీఫ్‌లు గెలిచినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఈ గెలుపొందిన డైరెక్టర్లు త్వరలో చైర్మన్‌ను ఎన్నికోనున్నారు. ఎన్నికల అనంతరం సంజీవరెడ్డి ప్యానల్ నాయకులు కె.రాజు, ఎల్‌డీ పాల్, శ్రీనివాస్‌యాదవ్, నాగేష్, కృష్ణారెడ్డి సంబురాలు జరుపుకున్నారు.

పెన్షనర్ల పట్ల కేంద్రం పక్షపాత వైఖరి సరికాదు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వ పక్షపాత వైఖరి సరికాదని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్‌జీపీఏ) తెలంగాణ అధ్యక్షుడు రాజేందర్‌బాబు అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం జనవరిలో ఇవ్వాల్సిన ఓ విడత కరువు భత్యం ఆలస్యంగానైనా ప్రకటించిందని సంతోషించాలో లేదో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన వేతన సవరణ సంఘం సిఫారసులు వర్తించవని చావుకబురు చల్లగా చెప్పిందన్నారు. సుప్రీంకోర్టు చెప్పిన తీర్పులకు విరుద్ధంగా కేంద్రం ఈ నిర్ణయం ఎలా తీసుకుంటుందని ప్రశ్నించారు. పెన్షనర్ల ప్రయోజనాలకు హాని కలిగించే చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం తన అసమ్మతిని తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీపీఏ ప్రధాన కార్యదర్శి ఎంవీ నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు వి.రాంమనోహర్, కోశాధికారి బి. నర్సయ్యలు తెలిపారు.

12న సంగీత పరిశోధన అంశాలపై శిక్షణ శిబిరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పావని, విజయకుమార్, నిష్టల సుధామాల, ఇందిరాహేమ

చిక్కడపల్లి: ప్రసిద్ధ సాంస్కృతిక సంస్థ సమితి ఆధ్వర్యంలో హంసధ్వని సంగీత పరిశోధన అంశాల రూపకల్పనపై ఈ నెల13న శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయ కర్తలు నిష్టల సుధామాల, డాక్టర్ ఇందిరా హేమలు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సంగీత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పావని దుడ్డు, సమితి సభ్యులతో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో సంగీత పరిశోధనా రంగంలో కొత్తగా అడుగు పెట్టిన విద్యార్థులు, అధ్యాపకులు ఆసక్తిగల పరిశోధకులు విశ్లేషణాత్మక ఆలోచన, సరైన శోధనా అంశాల ఎంపిక , పరిశోధనా విధానాలు సమాచార సేకరణ విధానాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.